# 102. ఇచ్చుటలో ఉన్న హాయి

ఆ మధ్య నేనూ ఎమ్వీయల్లూ ఒక సినిమాకి వెళ్లేం. ఎమ్వీయల్‌తో సినిమాకి వెళ్లడం అంటే అందులో సరదా ఎంతుంటుందో ఇబ్బంది కూడా అంతుంటుందని వివేకానందమూర్తి అంటూ వుండేవాడు. ఆ రోజు సినిమాకి ఎమ్వీయల్‌తో కలిసి వెళ్లుండకపోతే వివేకానందమూర్తి మాటల్లో నిజమెంతో అబద్ధమెంతో నాకు తెలిసుండేది కాదు. "ఎమ్వీయల్‌కి సినిమా నిర్మాణంలో చాలా పరిజ్ఞానం వుండడం చేత సినిమా చూస్తున్నంత సేపూ అతను డైరెక్షన్ పరంగా; ఫొటోగ్రఫీ పరంగా, రచన పరంగా, ఆఖరికి ఎడిటింగు పరంగా ఎక్కడెక్కడ ఎంతెంత లేసి స్వారస్యాలూ కష్టసుఖాలూ ఉన్నాయో వివరించి చెప్తాడు" అని వివేకానంద మూర్తి చెప్పేడు.

ఆ సినిమా పేరు "బుద్ధిమంతుడు". బుద్ధిమంతుడు అన్నపేరు గల ఆ సినిమాకి వెళ్లినప్పుడు బుద్ధిమంతుడిలా కూర్చోవడానికి నాకు వీల్లేకపోయింది. సినిమాకి వెళ్ళే నాలాంటి సామాన్య ప్రేక్షకులు ఆ సినిమాలో కథ ఏమిటి, పాటలే బావున్నాయా లేదా, నటీ నటులు సన్నివేశాలకి అనుగుణంగా హావభావాలని ప్రదర్శించేరా లేదా అని ఇలాంటి వేవో చూసుకుంటారు. ఐతే ఎమ్వీయల్‌తో ఆ సినిమా చూసినంతసేపూ సామాన్య ప్రేక్షకుడిగా కాక; సినిమా నిర్మాణంలో మొలలోతుకో తలలోతుకో దిగివున్న అసామాన్య ప్రేక్షకుడిగా తయారయిపోయానంటే అదంతా ఎమ్వీయల్ ప్రభావమే. తెరమీద ఒక షాట్ కొంత గొప్పది కనబడిందంటే నా తొడమీదనో వీపుమీదనో ఒక షాట్ అంతకన్నా గొప్పది పడేది. రచనలో ఒక చమత్కారం గోచరించినప్పుడల్లా అతను నాకు షేక్హాండిచ్చేసే పని. సర్వేపని చేసి చేసి రోజూ క్రాస్ స్టాఫ్ అనబడే ఇనుపరాడ్ కొన్నేసి గంటలు పట్టుకోవటంతో నాచేతి వేళ్లూ అరచేయీ గరుకు తేలిపోయి ఉన్నాయి. అయినా ఎమ్వీయల్ చేతివేళ్ల గరుకుతనం ముందు నాది గులాబీ రెక్కల మెత్తదనం అనిపించేసింది. మాయాబజారు సినిమాలో "కరపీడనం" ఘట్టంలో లక్ష్మణ కుమారుడు పడ్డ అవస్థలో పడిపోయాను. "నావి పిడకలు వేసిన చేతులు" అని ఒకావిడ అంటే "నావి జొన్నలు దంచిన చేతులు" అని ఇంకొకావిడ అన్నట్టు "గుండమ్మ కథ" సినిమాలో చూపించేరు. అది కూడా నాకు ఆ రోజు జ్ఞాపకం వచ్చింది.

మరో సినిమా ఏదైనా అయితే పరిస్థితి ఎలా వుండేదో గాని, ఆ సినిమాకి దర్శకుడు "బాపు" అవడం చేతా, రచయిత ముళ్లపూడి వెంకటరమణ అవడం చేతా, ఆ రెండున్నర గంటల్లోనూ నా తొడమీద అరవైకి పైగా దెబ్బలు, వీపు మీద దాదాపు యాభై గుద్దులు పడ్డాయి. షేక్హాండులైతే వంద దాటుంటాయి. ఇంత జరిగినా సరే; "మీతో సినిమా చూడ్డమే ఒక ఎడ్యుకేషను" అని చెప్పేసేటంత అభిమానం నాకు ఎమ్వీయల్ మీద కలిగింది.

"బుద్ధిమంతుడు" అన్న ఆ సినిమాలో "ఇచ్చుటలో ఉన్న హాయి - వేరెచ్చటనూ లేదు భాయీ" అని ఎలాగో ఒకపాటలో ఒక చరణం వచ్చింది. కవిత్వంలో వెల్లడైన రెండు ప్రాసల సొగసు సంగతి వదిలేసి "గొప్పగా చెప్పేడు కదూ!" అన్నాడు ఎమ్వీయల్. "అవును, ఏథెన్సు నగరపు టైమన్ అలాగే చేసి చివరికి సంపద అంతా పోగొట్టుకుని చివరికి శత్రువులను సంపాదించుకున్నాడు" అని నేను వెటకారం చేసేను.

"శత్రువుల్ని సంపాదించుకోడం మాట ఏమోగాని సంపద అంతా వదిలించుకోడం హాయే

కదా." అన్నాడు ఎమ్వీయల్. "భర్తృహరి ఏమన్నాడు? నాయనలారా, సంపద అనేది అన్నిటికంటే దుఃఖదాయకం. సంపాదించడం కష్టం; దాన్ని కాపాడుకోవడం కష్టం; అది పోతూ ఉంటే యాడవడం కష్టం-అని కదా!" అని చెప్పి; టైమన్ గార్ని సమర్థించేడు కూడాను.

ఆ తరవాత "ఇచ్చుటలో ఉన్న హాయి" ఫిలాసఫీ గురించి నేను కూడా చాలాసార్లు ఆలోచించేను. మా ఆవిడ తను వండిన కూరలూ, చేసిన పచ్చళ్ళూ, మరిగించిన పులుసులూ- ఇరుగుపొరుగు వాళ్లకి ఇవ్వడంలో తను ఆనందం పొందడమే కాకుండా, "ఇవాళ మధ్యాన్నం మీరు నిద్రపోతున్నారు గానీ, పొరుగింటి పోలేరమ్మగారు నేను (వంకాయ ఉల్లికారం పెట్టి) చేసిన కూర గురించి ఎంత పొగుడుతూ మాట్లాడిందో" లాంటి డైలాగులు చెప్పడం అలవాటు చేసుకుంది.

నాకు తెలిసిన ఒక మిలియనీర్ రచయిత తను అచ్చు వేయించుకున్న తన కవితా సంకలనం వెయ్యి కాపీల్లో ఒక్కటంటే ఒక్కటికూడా అమ్మకానికి పెట్టకుండా అన్నీ కాంప్లిమెంటరీ కాపీలుగా ఇచ్చేశారు. నేనొకసారి ఒక ఫోర్ స్టార్ హోటల్లో దిగిన నా ఫ్రెండుని పలకరిద్దామని వెళితే అక్కడ "ఉదయం ఏడుగంటల నుండి పదిగంటల వరకు (మా హోటల్లో రూముల్లో బసచేసిన వారికి) కాఫీ బ్రేక్ ఫాస్టు (ఫలహారం) కాంప్లిమెంటరీ" అని బోర్డుంది. ఒకానొక ఉత్తరాది సంస్థవారు తాము వ్యవస్థాపించిన బ్యాంకుకి "ఇచ్చే బ్యాంకు" అని అర్థం వచ్చే పేరు పెట్టేశారు.

కొన్నాళ్లకిందట నా ఫ్రెండు రాజమౌళి ఒకరోజున వాణిజ్య పన్నుల శాఖ ఆఫీసులో ఉద్యోగులకి, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఉద్యోగులకి ఆదాయపు పన్ను శాఖ ఉద్యోగులకి కొంత కొంత చొప్పున ఇచ్చిన సందర్భంగా అదంతా కూడితే నాకుటుంబానికి ఒక ఏడాది గ్రాసం అని తేలింది. "ఎందుకిలా ఇచ్చేసేవు" అని అడిగితే - వాళ్లందరూ నన్ను "ఇచ్చే" పరిస్థితుల్లో ఉండనిచ్చినందుకు - అని జవాబు చెప్పి "ఇచ్చుటలో ఉన్న హాయి, వేరెచ్చటనూ లేదు భాయీ" అని పాడేడు.

మా వూళ్లో సిటీ బస్సుల కండక్టర్లున్నారే; వాళ్లది ఇంకోరకం హాయి. డెబ్బయ్యయిదు పైసల టిక్కెట్టు కోసం రూపాయి పుచ్చుకున్నప్పుడూ, రూపాయి పావలా టిక్కెట్టుకోసం రూపాయిన్నర పుచ్చుకున్నప్పుడూ, రూపాయి డెబ్బయ్యయిదు పైసల టిక్కెట్టుకి రెండు రూపాయల నోటు పుచ్చుకున్నప్పుడూ వాళ్లు ఆ తోలుసంచీలు అతి జాగ్రత్తగా గలగల్లాడించి గిలగిల్లాడి ఇరవై పైసలు నాణాలు తీసి ఇస్తారు. ఇది కూడా ఇచ్చుటలో ఉన్న హాయే. ★

# 103. అప్పువిష(య)చక్రం

**మా** గణేశ్వరరావుకి ఒకప్పుడు అప్పులు చెయ్యడం అదొక గొప్ప హాబీగా వుండేది. సూత్రం ఏమిటంటే : దేశం పై దేశాల నుంచి అప్పులు తీసుకుంటుంది; అలాగే మనుషులు కూడా పక్క వాళ్లనుంచీ పరిచయస్తుల వరకూ ఎవరు దొరికితే - (అదే - ఎవరి దగ్గిర దొరికితే) - వారి దగ్గిర అప్పు తీసుకొని దేశమంటే మనుషులే అని నిరూపించాలని.

అరవై మూడులోంచి ముప్పయ్యారు తీసేయవలసి వచ్చినపుడు మూడు లోంచి ఆరు తగ్గించలేం కనక పక్క అంకెలోంచి అప్పు తెచ్చుకోమని రెండో క్లాసు చదువుతున్నప్పుడు మేష్టారు చెప్పేరుట.

"అయితే దేశం అప్పుడప్పుడు "ఎయిడ్స్" తెచ్చుకుంటుంది కదా; మనుషులు కూడా ఎయిడ్స్